
సాక్షి
కృష్ణాజిల్లా
శుక్రవారం । 6 । సెప్టెంబర్ । 2024



కేంద్ర మంత్రికి స్వాగతం

విమానాశ్రయం(గన్నవరం): వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు విచ్చేసిన కేంద్ర మంత్రి శివరాజ్‌సింగ్‌చౌహాన్‌కు విమానాశ్రయంలో నాయకులు, అధికారులు స్వాగతం పలికారు.



సాగర్ నీటిమట్టం

విజయపురిసౌత్: నాగార్జునసాగర్ జలాశయ నీటిమట్టం గురువారం 587.80 అడుగుల వద్ద ఉంది. కుడికాలువకు 8,529 క్యూసెక్కులు వదిలారు.

నేటి నుంచి యథావిధిగా పాఠశాలలు



చిలకలపూడి(మచిలీపట్నం): కలెక్టర్ డీకే బాలాజీ ఆదేశాల మేరకు జిల్లాలో శుక్రవారం నుంచి యథావిధిగా పాఠశాలను నిర్వహిస్తామని డీఈవో తాహెరా సుల్తానా గురువారం ఓ ప్రకటనలో తెలిపారు.

న్యూస్‌రీల్

వైఎస్సార్ సీపీ గౌడ విభాగం రాష్ట్ర అధ్యక్షునిగా శివరామకృష్ణ



చిలకలపూడి(మచిలీపట్నం): వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ గౌడ విభాగం రాష్ట్ర అధ్యక్షుడిగా మాదు శివరామకృష్ణను నియమిస్తున్నట్లు పార్టీ కేంద్ర కార్యాలయం గురువారం ఒక ప్రకటన విడుదల చేసింది. గన్నవరం నియోజకవర్గం విజయవాడ రూరల్ మండలం ఎనికేపాడు గ్రామానికి చెందిన ఈయనను పార్టీ అధ్యక్షులు, మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి ఆదేశాల మేరకు ఈ పదవిలో నియమించినట్లు పేర్కొంది.

ఆంధ్రప్రదేశ్‌ను ఆదుకోండి

ప్రధానమంత్రికి ఎంపీ బాలశౌరి లేఖ



చిలకలపూడి(మచిలీపట్నం): ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం విపత్కర పరిస్థితులు ఎదుర్కొన్న దృష్ట్యా ఆర్థిక సాయం అందజేసి ఆదుకోవాలని ప్రధాన మంత్రిని బందరు పార్లమెంట్ సభ్యుడు వల్లభనేని బాలశౌరి కోరారు. ఈ మేరకు ఆయన గురువారం ప్రధానమంత్రి నరేంద్రమోదీకి లేఖ రాశారు. 2008లో బిహార్‌లోని కోసి నదికి వరద వచ్చినప్పుడు అక్కడి ప్రజలు తీవ్రంగా నష్టపోయారని గుర్తుచేశారు. ఆ సమయంలో రాజ్యసభ, లోక్‌సభ సభ్యులు ఎంపీ నిధుల నుంచి ఒక్కొక్కరు రూ.10 లక్షలు చొప్పున ఆర్థిక సాయం అందజేసి వరద బాధితులను ఆదుకున్నారన్నారు. అదే రీతిలో ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రానికి రాజ్యసభ, లోక్ సభ సభ్యులు ఎంపీ నిధుల నుంచి రూ.50 లక్షల చొప్పున ఒక్కొక్కరు ఇచ్చి ఆదుకోవాల్సిన అవసరం ఉందని విన్నవించారు. ప్రధాన మంత్రి నరేంద్రమోదీతో పాటు ఉపరాష్ట్రపతి జగదీప్ ధంఖర్, లోక్‌సభ స్పీకర్ ఓంబిర్లాలకు కూడా ఆయన లేఖలు రాశారు.

పునరావాస కేంద్రాల పరిశీలన



హనుమాన్‌జంక్షన్ రూరల్: పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న నిర్వాసితులపై ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటున్నామని, నిరంతరం వైద్య సదుపాయాలను అందుబాటులో ఉంచుతున్నామని జిల్లా వైద్య, ఆరోగ్య శాఖ అధికారి డాక్టర్ జి.గీతాబాయి అన్నారు. బాపులపాడు మండలంలోని ఆరుగొలను సీఎస్ఐ స్కూల్, కానుమోలు జెడ్పీ హైస్కూల్‌లో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను గురువారం ఆమె సందర్శించారు. అక్కడి ప్రజలతో మాట్లాడి వసతులపై ఆరా తీశారు. పునరావాస కేంద్రాల్లో అందిస్తున్న భోజన సదుపాయాలను గురించి అడిగి తెలుసుకున్నారు. పునరావాస కేంద్రాల్లో ఆశ్రయం పొందుతున్న గర్భిణులు, బాలింతలు, వృద్ధుల కోసం వైద్య సిబ్బందిని అందుబాటులో ఉంచుతున్నట్లుగా తెలిపారు. గన్నవరం సబ్ యూనిట్ ఆఫీసర్ వెంకటరాజు, వైద్యాధికారులు డాక్టర్ కిరణ్మయి, డాక్టర్ అడపా దివ్య, మాజీ సర్పంచ్ చింతల వెంకట శివ అప్పారావు పాల్గొన్నారు.

విద్యుత్‌శాఖకు రూ.63.36లక్షలు నష్టం



మచిలీపట్నంటౌన్: భారీవర్షాలు, కృష్ణానదికి వచ్చిన వరదల కారణంగా కృష్ణాజిల్లాలో విద్యుత్‌శాఖకు రూ. 63.36లక్షల మేర నష్టం వాటిల్లింది. లంక గ్రామాలు, పొలాల్లో కలిపి సుమారు 11.05కిలోమీటర్ల మేర విద్యుత్ లైన్లు దెబ్బతిన్నాయి. 202 విద్యుత్‌స్తంభాలు నేలకూలగా, పలుచోట్ల ట్రాన్స్‌ఫార్మర్లు మరమ్మతులకు గురయ్యాయి. జిల్లాలోని పాములలంక సబ్‌స్టేషన్ నీటమునగగా, వరద తగ్గుముఖం పట్టడంతో సబ్‌స్టేషన్ నుంచి విద్యుత్ సరఫరాను పునరుద్ధరించారు. ఉమ్మడి కృష్ణాజిల్లా ఎలక్ట్రికల్ ఎస్‌ఈ మురళీ మోహన్, సీఈ సాంబశివరావు, జిల్లా విద్యుత్‌శాఖ కో–ఆర్డినేటర్ ఎం.భాస్కరరావు పర్యవేక్షణలో ఆ శాఖ అధికారులు, సిబ్బంది యుద్ధప్రాతిపదికన పనులు చేపట్టి విద్యుత్ సరఫరాను పునరుద్ధరిస్తున్నారు. ఆముదాలలంక, లచ్చిగానిలంక, పాములలంక, బొబ్బర్లంక, దక్షిణచిరువోలులంక తదితర గ్రామాలకు ఇప్పటికే విద్యుత్‌సరఫరాను పునరుద్ధరించారు.

వరద వీడినా.. తీరని వేదన

- సొంతంగా ఇళ్లు శుభ్రం చేసుకుంటున్న బాధితులు
- శానిటేషన్, ఫైర్ సిబ్బంది రావడం లేదంటూ ఆవేదన
- పలు చోట్ల పునరావాస కేంద్రాలు ఎత్తేసిన అధికారులు
- శాంతించని బుడమేరు.. ముంపులోనే పంట పొలాలు
- పెరుగుతున్న పంట, ఇతర నష్టం అంచనా
- జిల్లా అంతటా మళ్లీ వర్షాలు.. రోడ్లు, పొలాలు జలమయం

మద్దూరు వద్ద వరదనీటిలో కుళ్లిపోతున్న కందతోట



దారుణం.. దైన్యం

సాక్షి, మచిలీపట్నం: కొద్ది రోజులుగా ఉగ్రరూపం ప్రదర్శించిన కృష్ణమ్మ శాంతించడంతో ప్రభావిత ప్రాంత పల్లెలు తేరుకుంటున్నాయి. గురువారం 1.50లక్షల క్యూసెక్కులు మాత్రమే రావడంతో జిల్లా ప్రజలు ఊపిరి పీల్చుకుంటున్నారు. ముంపు నుంచి బయట పడడంతో తమ ఇళ్లను సొంతంగా శుభ్రం చేసుకునే పనిలో బాధితులు ఉన్నారు.

గృహాలను శుభ్రం చేసేందుకు అగ్నిమాపక శాఖ సిబ్బంది, శానిటేషన్ కార్మికులను పంపుతున్నట్లు ప్రభుత్వం ప్రకటించినా.. తమ ప్రాంతానికి ఎవరూ రావడం లేదని తీర ప్రాంత బాధితులు చెబుతున్నారు. అయితే బుడమేరు ఉద్ధృతి పూర్తిగా తగ్గలేదు. పలు గ్రామాల్లో ఉప్పొంగి ప్రవహిస్తుండడంతో పంట పొలాలు ఇప్పటికీ ముంపులోనే ఉన్నాయి. ఫలితంగా పంట దెబ్బ తింటుండడంతో నష్టం పెరుగుతోంది. మరో వైపు గురువారం కూడా జిల్లా అంతటా భారీ వర్షాలు కురవడంతో రోడ్లు జలమయం అయ్యాయి. వరద నుంచి ఇప్పుడిప్పుడే తేరుకుంటున్న జనం మళ్లీ వర్షాలు పడుతుండంతో ఆందోళనకు గురవుతున్నారు.



ముంపునకు గురైన వరిపైరును పరిశీలిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ



జనార్దనపురం వద్ద ఎంఎన్‌కే రహదారిపై చేరిన వరదనీరు

పెరుగుతోన్న నష్టం..

జిల్లాలో వరద ప్రభావంతో ముంపునకు గురైన పంటల విస్తీర్ణం పెరుగుతోంది. 1.45లక్షల హెక్టార్ల సాగు జరగ్గా 38,932 హెక్టార్లు ముంపునకు గురయ్యాయి. ఇందులో వరి 37,633, పత్తి 180, వేరుశనగ 328, మినుము 520, చెరకు 265, మొక్కజొన్న ఆరు హెక్టర్లలో పంట ముంపునకు గురైంది. పంట ముంపు బాధిత గ్రామాల సంఖ్య 403కు చేరగా రైతుల సంఖ్య 39,095 మందికి పెరిగింది. 4వేల హెక్టార్ల ఉద్యాన పంటలపై ముంపు ప్రభావం చూపింది.

పలు చోట్ల వర్షాలు..

జిల్లాలోని అన్ని మండలాల్లో గురువారం వర్షాలు పడ్డాయి. అధికంగా ఉంగుటూరు మండలంలో 94.2మిల్లీ మీటర్లు కాగా అతి తక్కువగా నాగాయలంకలో 7.0మి.మీ., జిల్లాలో మొత్తంగా 1,052.6మి.మీ., సగటు వర్షపాతం 42.1గా నమోదు అయింది.

సొంతంగా పనులు..



కె. కొత్తపాలెంలోని ఇంటి వద్ద బురదను బయటకు ఊడ్చుతున్న బాధితుడు

వరద ప్రభావం తగ్గుముఖం పట్టడంతో ఇళ్లు బయటపడుతున్నాయి. దీంతో బాధితులు సొంతంగా తమ ఇళ్లను శుభ్రం చేసుకుంటున్నారు. ప్రభుత్వం మాత్రం ముంపునకు గురయిన ఇళ్లను శుభ్రం చేసేందుకు ఫైర్, శానిటేషన్ సిబ్బందిని పంపుతున్నామని చెబుతున్నా.. తమ వద్దకు రావడం లేదని నాగాయలంక, అవనిగడ్డ, మోపిదేవి, కోడూరు, చల్లపల్లి మండలాల ప్రజలు అంటున్నారు. జిల్లాలో ఏర్పాటు చేసిన పునరావాస కేంద్రాలను పలు చోట్ల ఎత్తేశారు. ముఖ్యంగా అవనిగడ్డ నియోజకవర్గంలోని కొన్నింటిని ఎత్తేయడంతో ప్రజలు తిరిగి ఇంటి ముఖం పట్టారు.



బుడమేరులో నీటి ప్రవాహాన్ని పరిశీలిస్తున్న సిబ్బంది



నాగాయలంక మండలం ఏటిమొగ ఫంటు ప్లాట్ ఫారం వద్ద పారిశుద్ధ్య పనులు చేస్తున్న సిబ్బంది

జిల్లాలో పరిస్థితి..



యనమలకుదురులో పూర్తిగా దెబ్బతిన్న కూరగాయల పంటలు

- అవనిగడ్డలోని నాగాయలంక, అవనిగడ్డ, మోపిదేవి, కోడూరు, చల్లపల్లి మండలాల్లోని గ్రామాలు తేరుకుంటున్నాయి. అక్కడ ప్రజలు సొంతంగా శుభ్రం చేసుకుంటున్నారు. తీర ప్రాంతాల్లో విద్యుత్ సరఫరాను పునరుద్ధరించేందుకు పనులు చేపడుతున్నారు. రోడ్లు కోతకు గురవడంతో ఇంకా పలు గ్రామాల్లో రాకపోకలు లేవు.
- గన్నవరం కురిసిన భారీ వర్షానికి బుడమేరు ప్రవాహం పెరిగింది. జక్కులనెక్కలం, సావరగూడెం గ్రామాలు ఇంకా జల దిగ్బంధంలోనే ఉన్నాయి. బుడమేరు కాలువ ఉధృతి కారణంగా కేసరపల్లి – కంకిపాడు మధ్య రాకపోకలు నిలిచిపోయాయి.
- ఉంగుటూరు మండలంలో బుడమేరు పరీవాహక గ్రామాలైన వెల్దిపాడు, ఎలుకపాడు, లంకపల్లి, ముక్కపాడు, వేంపాడు, తరిగొప్పులలో పంట పొలాలు పూర్తిగా మునిగాయి. లోతట్టు ప్రాంతంలోని ఇళ్లల్లోకి నీరు చేయడంతో బాధితులు ఇప్పటికీ పునరావాస కేంద్రాల్లోనే ఉన్నారు.
- స్వచ్ఛంద సంస్థలు బాధితులకు ఆహారం అందిస్తున్నారు తప్ప ప్రభుత్వ యంత్రాంగం మొక్కుబడిగా చేస్తోంది. తేలప్రోలు–నందమూరి గ్రామాలు, ఉంగుటూరు–పుట్టగుంట ప్రధాన రహదారిలో బుడమేరు ప్రవహించడంతో రాకపోకలు పూర్తిగా స్తంభించాయి.
- వరద తగ్గడంతో పెనమలూరు మండలంలోని తీరప్రాంత గృహాలు ముంపు నుంచి బయట పడ్డాయి. ప్రజలు స్వయంగా ఇళ్లను బాగు చేసుకుంటున్నారు. కంకిపాడు మండలంలో మద్దూరు, కాసరనేనివారిపాలెంలో పంట పొలాలు ఇంకా ముంపులోనే ఉన్నాయి.
- గన్నవరం మండలం కేసరపల్లి వద్ద బుడమేరు వరద ఉధృతిని సీఎం చంద్రబాబు పరిశీలించారు. వరద ప్రభావిత ప్రాంతాలను పరిశీలించేందుకు కేంద్ర వ్యవసాయ శాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్ చేరుకున్నారు.
- నందివాడ మండలం పుట్టగుంట వద్ద గోడమేరు ఉగ్రరూపం దాల్చి, ఉధృతంగా ప్రవహిస్తోంది. బాధితులకు సహాయం అందించేందుకు 40 మందితో కూడిన ఎన్డీఆర్ఎఫ్ బృందం వచ్చింది.
- పెడన పట్టణంలోని వీధులు ఇంకా ముంపులోనే ఉన్నాయి. చాలా చోట్ల కలంకారీ కుటీర పరిశ్రమలు మూతపడ్డాయి. ముంపులోనే కాలనీ ఉండటంతో రాకపోకలకు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు.
- బంటుమిల్లిలో మైనర్ డ్రెయిన్లు పొంగిపొర్లడంతో కాలనీలు జలమయం అయ్యాయి. ఐదు రోజులుగా తాము ఇబ్బందులు పడుతున్నా ప్రభుత్వ యంత్రాంగం రాలేదని కాలనీ వాసులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

వరద బాధితులకు అండగా నేను సైతం

మాజీ సీఎం వైఎస్ జగన్‌ను కలిసి సాయం అందించిన చిన్నారి



మాజీ సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి సొమ్ము అందిస్తున్న చిన్నారి అభయ్‌రామ్

ఉయ్యూరు: వరద బాధితులకు సాయం అందించేందుకు నేను సైతం అంటూ ఓ చిన్నారి ముందుకు వచ్చాడు. తాను కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.10 వేలు నగదును మాజీ ముఖ్యమంత్రి, వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి అందించాడు. పార్టీ పెనమలూరు నియోజకవర్గ సమన్వయకర్త దేవభక్తుని చక్రవర్తి, సీడీసీ చైర్మన్ రాజులపాటి రామచంద్రరావు గురువారం మాజీ సీఎం వైఎస్ జగన్‌ను తాడేపల్లిలోని కార్యాలయంలో కలిశారు. తనతో పాటు జగన్ వద్దకు వచ్చిన రామచంద్రరావు మనవడు ఒకటో తరగతి చదువుతున్న రాజులపాటి అభయ్‌రామ్ తన కిడ్డీ బ్యాంకులో దాచుకున్న రూ.10 వేలు నగదును వరద బాధితుల సాయం నిమిత్తం వినియోగించాలని అందించాడు. చిన్నారి అభయ్‌రామ్ దాతృత్వాన్ని జగన్ అభినందించి ఆశీర్వదించారు.

కోసూరువారిపాలెంలో వృద్ధుడి హత్య



సత్యనారాయణ మృతదేహం

కోసూరువారిపాలెం(మోపిదేవి): గ్రామంలో బుధవారం అర్ధరాత్రి జరిగిన వృద్ధుడి హత్య కలకలం రేపింది. కరకట్ట సమీపంలోని ఇంట్లో నిద్రిస్తున్న సమయంలో గుర్తు తెలియని ముగ్గురు వ్యక్తులు చొరబడి సత్యనారాయణ (76) అనే వ్యక్తి ముఖంపై బలంగా కొట్టి, గొంతు నులిమి హతమార్చారు. అలజడి వినిపించి పక్క గదిలో నిద్రిస్తున్న భార్య లక్ష్మీకాంతం లేచి దొంగ, దొంగ అని అరవడంతో ముగ్గురు వ్యక్తులు బైక్‌పై కరకట్టమీదుగా పరారైనట్లు కుటుంబ సభ్యులు తెలిపారు. అపస్మారక స్థితిలో ఉన్న సత్యనారాయణను తొలుత అవనిగడ్డ ప్రభుత్వాసుపత్రికి తరలించారు. వైద్యుల సూచనల మేరకు మచిలీపట్నం తరలిస్తుండగా దారిలోనే మృతి చెందినట్లు తెలిపారు. సమాచారం అందుకున్న అవనిగడ్డ డీఎస్పీ మురళీధర్ ఘటనా స్థలానికి చేరుకొని పరిస్థితిని సమీక్షించారు. క్లూస్ టీం, డాగ్‌స్క్వాడ్ చేరుకుని వివరాలు సేకరించాయి. మృతుడి కుమారుడు బడే వెంకట రామాంజనేయులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి డీఎస్పీ ఆధ్వర్యంలో దర్యాప్తు చేస్తున్నట్లు చల్లపల్లి సీఐ ఈశ్వరరావు తెలిపారు. మృతుడికి భార్య లక్ష్మీకాంతం, ఇద్దరు కుమారులు, ఒక కుమార్తె ఉన్నారు. ఇది ఇలా ఉండగా మృతదేహానికి ఖర్మ కాండలు చేసే సమయంలో బ్యాండ్ వాయించేందుకు వెళ్లిన ముక్కొల్లు పోతురాజు (72)కు గుండెపోటు రావడంతో అక్కడికక్కడే మృతి చెందాడు. మృతుడికి భార్య శివపార్వతి ఉన్నారు.



సంఘటన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న డీఎస్పీ మురళీధర్

‘గురు’తర బాధ్యత మరువొద్దు

- గురుపూజోత్సవంలో కలెక్టర్ డీకే బాలాజీ
- ఎమ్మెల్సీ లక్ష్మణరావుతో కలిసి ఉత్తమ ఉపాధ్యాయులకు సత్కారం



హెచ్ఎం శ్రీనివాసన్‌ను సత్కరిస్తున్న కలెక్టర్ డీకే బాలాజీ చిత్రంలో ఎమ్మెల్సీ లక్ష్మణరావు, డీఈవో తాహెరా సుల్తానా

చిలకలపూడి(మచిలీపట్నం): ఉపాధ్యాయులు ప్రతి ఒక్క విద్యార్థిని బాధ్యత గల పౌరుడిగా ఎదిగేలా చూడాలని కలెక్టర్ డీకే బాలాజీ ఉపాధ్యాయులను కోరారు. డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జయంతిని పురస్కరించుకుని గురుపూజ మహోత్సవ కార్యక్రమంలో భాగంగా జిల్లా పరిషత్ కన్వెన్షన్ హాలులో జిల్లా ఉత్తమ ఉపాధ్యాయ పురస్కార ప్రదానోత్సవ కార్యక్రమాన్ని గురువారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో తొలుత జ్యోతి ప్రజ్వలన చేసి ప్రారంభించిన అనంతరం సర్వేపల్లి రాధాకృష్ణన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం కలెక్టర్ మాట్లాడుతూ విద్యార్థుల్లో భౌతిక, మేధో, నైతిక, ఆధ్యాత్మిక వ్యక్తిత్వం పెంపొందించాలని కలెక్టర్ ఉపాధ్యాయులకు సూచించారు. కేవలం మార్కుల కోసం బోధించటమే కాకుండా విద్యార్థి చదివింది అర్థం చేసుకుని తన భాషలో వ్యక్తం చేసేలా సొంతంగా రాయగలగటం, మరో పది మందికి చెప్పగలిగేలా తీర్చదిద్దాలన్నారు. 1945లో రెండో ప్రపంచ యుద్ధంలో జపాన్ దేశం భూస్థాపితం అయిపోయిందన్నారు. అయితే 50 సంవత్సరాల్లో తిరిగి ప్రపంచంలోనే అగ్రగామి దేశంగా ఎదిగిందన్నారు. ఈ ఎదుగుదలలో అక్కడున్న ఉపాధ్యాయులే కీలకపాత్ర పోషించారని గుర్తుచేశారు. శాసనమండలి సభ్యుడు కేఎస్ లక్ష్మణరావు మాట్లాడుతూ మొదటి మహిళా ఉపాధ్యాయురాలైన సావిత్రి భాయ్ పూలే జనవరి 3వ తేదీన జన్మించారని, ఆ రోజున మహిళా ఉపాధ్యాయ దినోత్సవంగా నిర్వహించాలని తాము కోరుతున్నామన్నారు. జిల్లాలో మొత్తం 74 లక్షల మంది విద్యార్థులు అన్ని యాజమాన్య పాఠశాలల్లో చదువుతున్నారని అయితే 35 లక్షల మంది విద్యార్థులు ప్రభుత్వ పాఠశాలలో చదువుతున్నారన్నారు. వీరిలో ఎక్కువశాతం బడుగు, బలహీనవర్గాలు, ఎస్సీ, ఎస్టీ పిల్లలేనని, వీరిని సొంత బిడ్డలా మనసుపెట్టి చదువు చెప్పి పాఠాలు చెప్పి ఉన్నతంగా తీర్చిదిద్దాలన్నారు. అనంతరం ఉత్తమ సేవలు అందించిన ఉపాధ్యాయులను సన్మానించి పురస్కారాలను కలెక్టర్ డీకే బాలాజీ, ఎమ్మెల్సీ లక్ష్మణరావు చేతుల మీదుగా అందజేశారు. డీఈవో తాహెరాసుల్తానా, డీవైఈవో శేఖర్‌సింగ్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.



సర్వేపల్లి విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న కలెక్టర్ బాలాజీ, ఎమ్మెల్సీ లక్ష్మణరావు

అన్ని విధాలా ఆదుకుంటాం

రైతులతో కృష్ణా జిల్లా కలెక్టర్ బాలాజీ

ఉంగుటూరు: ముంపునకు గురైన గ్రామాల ప్రజలను అన్ని విధాలా ఆదుకుంటామని కృష్ణా జిల్లా కలెక్టర్ డీకే బాలాజీ అన్నారు. మండలంలో బుడమేరు ఉధృతిని కలెక్టర్ గురువారం పరిశీలించారు. లంకపల్లి, ముక్కపాడు గ్రామాల్లో పర్యటించి గ్రామస్తులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. బుడమేరు వరద నీరు గ్రామంలోకి వచ్చిందని, గ్రామం చుట్టూ 3 కిలోమీటర్ల పరిధిలో వరి పంట పొలాలను నడుం లోతు వరకు ముంచేసిందన్నారు. దీనికి ముఖ్య కారణం బుడమేరు కరకట్ట దగ్గర కొందరు ఇష్టానుసారంగా రొయ్యలు, చేపల చెరువులు తవ్వి సాగు చేస్తున్నారని చెప్పారు. ముక్కపాడులో అవస్థలు పడుతున్న 1300మందిని ట్రాక్టర్లలో సురక్షిత ప్రాంతానికి తరలించామన్నారు. అయితే కలెక్టర్ పక్క గ్రామానికి వచ్చి తమ గ్రామానికి రాలేదని ఓంగ్రపాడు గ్రామస్తులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ పర్యటనలో తహసీల్దార్ విమల కుమారి, ఏఎస్ఎంలు, టీడీపీ మండలాధ్యక్షుడు కృష్ణారెడ్డి పాల్గొన్నారు.



ముక్కపాడులో రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ బాలాజీ